



www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 16 | అక్టోబర్ | 2025 పేజీలు : 8


## రోడ్ల నిర్వహణ, పర్యవేక్షణపై నిర్లక్ష్యం వీడండి



- యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు పూర్తి చేయాలి
- మున్నేరు బ్రిడ్జి మరమ్మతులను పరిశీలించిన ఎంఎల్ఏ కూనంనేని

2లో..












# రోడ్ల నిర్వహణ, పర్యవేక్షణపై నిర్లక్ష్యం వీడండి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పట్టణ గ్రామీణ రహదారులు, అంతర్గత రోడ్ల నిర్వహణ, పర్యవేక్షణపై అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని, ప్రజలు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేసే విధానాన్ని మానుకోవాలని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అధికారులను హెచ్చరించారు. పట్టణంలోని ముర్రేడువాగు బ్రిడ్జీ రోడ్డులో జరుగుతున్న మరమ్మత్తు పనులను ఆయన బుధవారం మున్సిపల్, ఆర్ అండ్‌బి, పోలీస్ శాఖతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గత పాలకులు హయాంలో రోడ్ల నిర్మాణాల్లో జరిగిన అవినీతి అక్రమాల వల్లే ప్రజలకు ఈ ఇబ్బంది ఎదురైంది. నిర్మాణాల్లో నాణ్యతా లోపం కారణంగా రోడ్లు ధ్వంసం అయ్యాయన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల పనులు ఇతర అభివృద్ధి పనులు నాణ్యతతో కలకాలం మన్నికగా ఉండేలా నిర్మించాలన్నారు. నాణ్యతా లోపం జరిగితే అధికారులదే పూర్తి బాధ్యత అన్నారు. రోడ్లపై ఎర్పడ్డ గుంతల విషయంలో రాజకీయాలు తగవని, సమస్య ఉంటే బాధ్యతగల పౌరులుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోస్టాఫీస్ సెంటర్ నుండి హేమచంద్రాపురం వరకు సింగరేణి ప్రధాన కార్యాలయం నుండి సింగరేణిప్రధాన ఆస్పత్రి వరకు, సింగరేణి మెయిన్ స్టోర్స్ వరకు రోడ్ల పనులు యుద్ద ప్రాతిపదికన చేపట్టబోతున్నట్లు చెప్పారు. ఇందు కోసం సింగరేణి రూ.2.80 కోట్లు నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తెస్తామని చెప్పారు. రెండో దఫా బస్టాండ్ సెంటర్ నుండి త్రిమాత ఆలయం వరకు రోడ్డు నిర్మాణం, రోడ్డు వెడల్పు బస్టాండ్ గేట్ సెంటర్లో హైమాస్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మున్సిపల్ కమీషనర్ సుజాత, ఆర్అండ్‌బి అధికారులు, నాయకులు లగడపాటి రమేష్, దేవరగట్టల రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు విడుదల చేయండి




**-పెన్షనర్ల ప్రదర్శన, ధర్నా**

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రభుత్వ సర్వీసులలో సేవలు అందించి రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ప్రదర్శన, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నాను జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య ప్రారంభించి మాట్లాడుతూ గత 18 నెలలుగా రిటైర్ అయిన ఉద్యోగుల జిపిఎఫ్, గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ తదితర ఆర్థిక బకాయిలు విడుదల చేయకపోవడంతో రిటైర్ ఉద్యోగులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఆవేదనతో కొంత మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించారని వారు తెలిపారు. 2024 మార్చి నుంచి ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షనరీ ప్రయోజనాలు రాలేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బకాయిల చెల్లింపు కోసం రూ. 700కోట్లు విడుదల చేస్తామని ప్రకటించి మాట నిలుపుకోలేదన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఖమ్మం నగరానికి మార్చాలని పలుమార్లు విన్నవించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కలెక్టరేట్‌లో ఉన్న ట్రెజరీకి పెన్షనర్లు రాలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.వెంటనే పెన్షనర్ల బకాయిలను విడుదల చేయాలన్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో వసతులను మెరుగుపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు, పంచాయతీరాజ్ మాజీ సంఘం నాయకులు వెంకటపతిరాజు, సీనియర్ నాయకులు ఎన్. కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. దుర్గాదేవి, జనార్థన్, ఆర్థిక కార్యదర్శి డికె శర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాంబశివరావు, ఖాజామోహినుద్దీన్, రాజారావు, కూతురు కృష్ణమూర్తి, చెల్లి బాబురావు, రాయల వెంకటనారాయణ, బస్వారావు, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, హన్మంతరావు, రమేష్, రమణ యాదవ్, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బిసి బిల్లును కేంద్రం ఆమోదించాలి



**-బిల్లు ప్రతులు దహనం**

ప్రజాపక్షం/ ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పంపిన 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలని బిసి హక్కుల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బిసి రిజర్వేషన్ బిల్లును నిలుపుదల చేస్తూ ఇచ్చిన బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు శింగు నర్సింహారావు మాట్లాడుతూ బిజెపి రిజర్వేషన్ల విషయంలో దొంగాట ఆడుతుందని రాష్ట్రంలో మద్దతునిస్తూ కేంద్రంలో తొక్కిపట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. బిసి వ్యతిరేకిగా బిజెపి వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని నర్సింహారావు స్పష్టం చేశారు. ఈనెల 18న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి , నూనె శశిధర్, నానబాల రామకృష్ణ, తాటి నిర్మల, మోహన్‌రావు, నాగేశ్వరరావు, బాబు, జ్వాలా నర్సింహారావు, ఉపేందర్, ఆముదాల వెంకన్న, యాకయ్య, ప్రసాద్, శ్రీశైలం, రమేష్, ఆనంద్, వీరబాబు, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటి విద్యార్థినికి బంగారు పతకం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్: రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో ఎస్‌బిఐటి కళాశాల విద్యార్థిని గణేష్ హాలయ బంగారు పతకం సాధించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో తమ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గణేష్ హాలయ ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించిందని ఆయన తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతో పాటు విద్యార్థుకు క్రీడలపై ప్రత్యేక శిక్షణ అందిస్తు ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల మక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి వారి నైపుణ్యాలకు అనుగుణంగా కావాల్సిన వసతులను సమకూరుస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం విద్యను కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తద్వారా వారి మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పాడతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఇష్టాలు గ్రహించి వారిలో దాగి ఉన్న కళలను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.









# చివరి గింజ వరకు కొనుగోలు



**-కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలి**
**-గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో రైతులు పండించిన చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ అనదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి వానాకాలం పంటల కనీస మద్దతు ధరపై గోడ ప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన పంటలకు సంబంధించిన మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. గ్రేడ్ ఎ ధాన్యం రకానికి రూ. 2389 లతో పాటు రూ. 500 బోనస్, సాధారణ రకం ధాన్యానికి రూ.2369 ప్రకటించిందన్నారు. పత్తి (పొడవు గింజ) రూ. 8110, పత్తి (మధ్యస్థ గింజ) రూ.7710, మొక్కజొన్నకు రూ.2400, కందులు రూ. 8వేలు, పెసర రూ.8768, వేరుశనగ కు రూ.7263, మినుములు రూ.7800, పొద్దుతిరుగుడుకు రూ.7721, సోయాబీన్‌కు రూ. 5328, నువ్వులకు రూ. 9846, సజ్జలు రూ. 2775, రాగులకు రూ. 4886 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రైతులు స్థానిక మార్కెట్ యార్డులో తమ పంటలను కనీస మద్దతు ధరకు విక్రయించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామని సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ కూడా అందిస్తుందన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకు రావాలని కోరారు. సిసిఐ కేంద్రాల ద్వారా పత్తిని విక్రయించి మద్దతు ధరను రైతులు పొందాలన్నారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చునన్నారు. పత్తి కొనుగోలు సంబంధిత సేవలకై 18005995779 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, జిల్లా సహకార అధికారి గంగాధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. బుధవారం నగరంలోని 16, 50 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మంత్రి తుమ్మల సహకారంతో కార్పొరేషన్‌లో అన్ని డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటేషన్ సూపర్ వైజర్ సాంబయ్య, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి సిపిఐ శతాబ్ది చరిత్ర




**-ఆదర్శంగా హవేలీ శాఖ**
**-హవేలీ సమావేశంలో నగర కార్యదర్శి జానిమియా**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ఇంటింటికి తెలియజేయాలని ఇందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ప్రతాపనేని ఉపేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జానిమియా మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని దానికి ముందే కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరాలకు తెలియజేసేవిధంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా పార్టీ ఉద్యమ చరిత్రను, అమరులైన వారి త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించనున్నట్లు జానిమియా తెలిపారు. ఖానాపురం హవేలీ శాఖ సభ్యులు మొత్తం పార్టీ శత వసంత ముగింపు ఉత్సవాల సందర్భంగా జరిగే కార్యక్రమాలకు ప్రతి సభ్యుడు రూ. 500 విరాళంగా ప్రకటించడం అభినందనీయమన్నారు. హవేలీ శాఖ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. పార్టీ ప్రచార కార్యక్రమానికి సంబంధించి గడప గడపకు వెళ్లేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ, సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ, పార్టీ బాధ్యులు జాకీరుద్దీన్, ఆముదాల వెంకన్న, పి.వెంకటేశ్వర్లు, బానోత్ రాములు, అజీమ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన మేయర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** ఖమ్మం నగరంలో ప్రత్యేక పారిశుధ్య పనులను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఇల్లందురోడ్డు, రాపర్తి నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది నిబద్ధతతో పని చేయాలన్నారు. నగర ప్రజల ఆరోగ్యం పరిరక్షణకు కార్పోరేషన్ ఆధ్వర్యంలో తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లపై చెత్త లేకుండా, కాలువలను శుభ్రం చేయడంతో పాటు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నట్లు తెలిపారు. డివిజన్లలో చెత్త వాహనాలు సమయపాలన, సిబ్బంది విధులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాపర్తి శరత్‌కుమార్, మేడారపు వెంకటేశ్వర్లు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పత్తి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టండి




**-సిసిఐ కేంద్రాలను ప్రారంభించండి**
**-రైతు సంఘం డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పత్తి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ ఏడాది మునుపెన్నడు లేని రీతిలో నష్టపోయారని తెలిపారు. రైతు సంఘం సమావేశం బుధవారం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ ఈ ఏడాది అతివృష్టి కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎకరాకు క్వింటా, రెండు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. కనీస పెట్టుబడులు రావని వచ్చిన పత్తి కూడా వర్షాలు పడుతుండడంతో అంత నాణ్యతగా లేదని గోవిందరావు తెలిపారు. పత్తి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పరిహారాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాలను సిసిఐ ఆధ్వర్యంలో ప్రారంభించాలని ఆయన సూచించారు. క్వింటాకు రూ. 10071 చొప్పున కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ రంగం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందని ఆయన ఆరోపించారు. కలిసిరాని ప్రకృతి, ఆదుకోని ప్రభుత్వాల మధ్య వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుందని దీనిని కాపాడేందుకు వ్యవసాయ రంగ పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## లచ్చిరెడ్డికి పరామర్శ

**ప్రజాపక్షం/చింతకాని :** కోమట్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ కార్యకర్త అవులూరి లచ్చిరెడ్డి ఇటీవలే కాలుకు సర్జరీ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి బుధవారం లచ్చిరెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజా క్షేత్రంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సీపీఐ శాఖ కార్యదర్శి అవులూరి రామిరెడ్డి పాల్గొన్నారు.



## చింతకాని పోషణ్ అభియాన్

**ప్రజాపక్షం/చింతకాని :** ఆరోగ్యంగా ఉండాలంటే చిరు ధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అధికారి రామ్ గోపాల్‌రెడ్డి, సూచించారు. చింతకాని మండల కేంద్రంలో పోషణ పక్వాడ్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పలు సూచనలు చేశారు. బాలింతలు చిన్నారులు రక్తహీనత లోపం అధిగమించాలంటే సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. సరైన పోషకాహారంలో అన్ని విటమిన్లు, లవణాలు, పిండిపదార్థాలు, ప్రొటీన్లు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. గర్భిణీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చంచు శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి అల్తాఫ్, సీడీపీవో సీహెచ్ కమల ప్రియ' ఏసీడీపీవో శివమ్మ, సూపర్‌వైజర్ విజయ లక్ష్మీ, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ వి. షామిలి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# మార్కెట్ ఆదాయాన్ని పెంచాలి

**ప్రజాపక్షం/ వైరా :** వైరా వ్యవసాయ మార్కెట్ ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు తెలిపారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన పాలక వర్గ సమావేశం చైర్మన్ బోళ్ల గంగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ బోళ్ల గంగారావు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ లు మాట్లాడుతూ మార్కెట్ ఆదాయాన్ని పెంచేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, చెక్‌పోస్టుల ఆదాయాన్ని పెంచుట, షాపింగ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు, యార్డ్ నందు సిసి రోడ్లు తదితర అంశాలపై పాలక వర్గ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తోటకూర నాగేశ్వరరావు, పొట్టపల్లి గోపి, పూనాటి బాబురావు, బానోత్ మురళీకృష్ణ, జాలాది తిరుపతిరావు, కాసిమళ్ల వెంకటేశ్వరరావు, షేక్ మౌలాలి, సత్యం, మోతుకూరి వెంకటేశ్వరరావు, మల్లేశ్వరి, ఏడిఏ కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి, మార్కెట్ సహాయ కార్యదర్శి, సూపర్‌వైజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సోలార్ పవర్‌పై ప్రత్యేక దృష్టి




## జిఎం షాలోం రాజు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కంపెనీ భవిష్యత్‌లో నెట్ జీరో కంపెనీగా మారే దిశగా పలు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం సోలార్ పవర్ జనరేషన్ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు కొత్తగూడెం ఏరియా సింగరెణి జిఎం షాలేం రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని జేవిఆర్ ఓసీలో జరిగిన విలేకరుల సమావేశంలో జిఎం షాలెం రాజు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో ఉత్పత్తి, అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ప్రతి సంవత్సరం సింగరేణి సుమారు 700 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం చేస్తోందని, దానిని తగ్గించడానికి సోలార్ పవర్ వినియోగం పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం కంపెనీ 300 మెగావాట్ల పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయగా, కొత్తగూడెం ఏరియా కింద 102 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం కృషి జరుగుతోందని చెప్పారు. అదేవిధంగా రాజస్థాన్ ప్రభుత్వం తో చర్చలు జరిపి అక్కడ కూడా పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని తెలిపారు. అదే విదంగా అదనంగా పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సత్తుపల్లి ప్రాంతంలో మట్టిలో ఖనిజాలు ఉన్నట్లు గుర్తించినందున, వాటిని ప్రాసెస్ చేసి వాటి విలువ ఆధారంగా ఇతర కంపెనీలకు అందించనున్నట్లు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 156.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 75.71 లక్షల టన్నుల వెలికితీత జరగిందని తెలిపారు. అదే విధంగా 869 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 391 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 26 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. డిఎంఎఫ్ టి నిధుల ద్వారా రూ.247 కోట్లు ఇప్పటికే కేటాయించామని చెప్పారు. భవిష్యత్తులో ఈ నిధులను మరింత పెంచే దిశగా కృషి చేస్తామన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ కోరిక మేరకు సింగరేణి తరపున మెగా జాబ్ మేళా త్వరలో ఏర్పాటు చేయనున్నామని, తద్వారా సుమారు రెండు నుండి మూడ వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ సమావేశంలో కిష్టారం పిఓ నరసింహా రావు, ఎస్ ఓ టూ జిఎం కోటిరెడ్డి, జేవిఆర్ సిహెచ్ పి సోమశేఖర్, ఏరియా ఇంజనీర్ రాజు, మోహన్ రావు ఏరియా పర్సనల్ మేనేజర్, వెల్ఫేర్ ఆఫీసర్లు కావ్య, దేవదాసు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అందరి చూపు ఆయన వైపే..

## డిసిసి అధ్యక్షుడిగా దయానందకే మా మద్దతు





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అందరి చూపు ఆయన వైపే ఉంది. డిసిసి అధ్యక్షుడిగా డా.మట్టా దయానంద్ కే తమ మద్దతు అని ముక్త కంఠంతో ఏఐసీసీ అబ్సర్వర్ మహేంద్రన్, ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ సమక్షంలో తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు. బుధవారం పట్టణంలోని ఎంఆర్ గార్డెన్ నందు సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్రన్, సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ లు హాజరై ఖమ్మం జిల్లా డీసీసీ నూతన అధ్యక్షులు నియామకం సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గం నుండి డీసీసీ పోటీ కోసం ఆశవాహులు నుండి దరఖాస్తులు ఆహ్వానించారు.అదే విధంగా ప్రతి మండలం నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను విడి, విడిగా పిలిచి అభిప్రాయ సేకరణ చేయగా ప్రతి ఒక్కరూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ పేరును సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకులు తుమ్మల యుగంధర్, పిఆర్ఓ రాకేష్, సత్తుపల్లి ఇంచార్జ్ చక్కిళం రాజేశ్వర్ రావు, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు పువాళ్ళ దుర్గా ప్రసాద్, పీసీసీ జనరల్ సెక్రటరీ నూతి సత్యనారాయణ,మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలరాణీ గణేష్, సందీప్ గౌడ్ లతో పాటు సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నర్సింహారావు, కమల్ పాషా, వినుకొండ కృష్ణ, ఆంగోతు రామారావు, షరీఫ్, సత్తుపల్లి నియోజకవర్గం 5 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# ఓటు చోర్‌పై 1వ వార్డులో సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో రాహుల్‌గాంధి చేపట్టిన దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటు చోరీ కార్యక్రమానికి మద్దతుగా ఒకటో వార్డులో వైరా కాంగ్రెస్ పట్టణ నాయకులు వీరంశెట్టి సీతారాములు, ఒకటో వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగె వెంకన్న, ఉపాధ్యక్షులు దురిశెట్టి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి మోరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరంశెట్టి సీతారాములు మాట్లాడుతూ ఓట్ల చోరీ జరిగిందని, దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధి చేపట్టిన కార్యక్రమానికి మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమం వైరాలో చేపట్టడం జరిగిందని, ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ నాయకులు దుగ్గిరాల జాకోబు, దుగ్గిరాల ఏలీషా, దుగ్గిరాల బాలస్వామి, గాజుల మహేష్, కడియాల జోజి, కొమ్ము దిలీప్, తాల్లూరి జంపన్న, కురిశెట్టి పద్మ, దుగ్గిరాల మహేష్, చల్లా కిట్టయ్య, కడారి రాకేష్, కోపెల మనోజ్, చింతపల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బజేపి ఆధ్వర్యంలో నిరసన దీక్ష




**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని దీనివలన రోడ్డుప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని ఆర్అండ్‌బిశాఖ వెంటనే రోడ్లు మరమ్మత్తు చేపట్టాలని భారతీయజనతాపార్టీ తరుపున నిరసన దీక్ష బుధవారం చేపట్టారు అనంతరం వైరా ఆర్అండ్‌బి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు పల్లిపాడునుంచి ఏన్కూర్ వెళ్లే ఆర్అండ్‌బిరోడ్డుపై మోకాలులోతు గుంతలు ఏర్పడి ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుమీదుగా నిత్యం వేలాది వాహనాలు తిరుగుతునానయని ప్రమాదాలకు కేరాఫ్‌గా ఈరోడ్డునిలిచిందని అన్నారు. ఆర్అండ్‌బి శాఖ అధికారులు వెంటనే రోడ్డుమరమ్మతులు చేపట్టి ప్రజలప్రాణాలను కాపాడాలని కోరారు. ఈకార్యక్రమంలో బిజేపి జిల్లా ఉపాధ్యక్షులు బండారు నరేష్, జిల్లా కార్యదర్శి తొండపు సైదేశ్వరరావు, దుద్దుకూరి కార్తీక్, నరుకుల్లా వెంకటేశ్వరరావు, చింతనిప్పు రామారావు, ఏపూరి శ్రీనివాసరావు, వైరా బిజేపి టౌన్ అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ, వైరా రూరల్ మండల అధ్యక్షుడు దోసపాటి కళ్యాణ్, కొణిజర్ల మండల అధ్యక్షుడు కవిడ మురళీకృష్ణ, పల్లెపాటి వెంకటేష్, వల్లెపు అనిల్, వాకదాని నరసింహారావు, దరియాసింగ్, నరేష్, జనార్ధన్, ఓర్సు శ్రీనివాస్, గుప్తా నాగేంద్రబాబు, కూరగాయల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల క్రీడలు ప్రారంభం

**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండల స్థాయి పాఠశాల క్రీడలు బుధవారం రామకృష్ణాపురం సెయింట్ థెరిస్సా పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడలను మండల విద్యాశాఖాధికారి ఎస్ రామారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ క్రీడలలో ప్రభుత్వ , ప్రైవేటు, కేజీబీవి విద్యార్థులు పాల్గొనటం జరిగింది. తొలి రోజు జరిగిన పోటీల్లో అండర్17 బాలికల కబడ్డీ లో ప్రథమ బహుమతి శ్రీ గ్లోబల్ హైస్కూల్, ద్వితియ బహుమతి లచ్చగూడెం జడ్పీహెచ్ఎస్, అండర్ 14 బాలికల కబడ్డీ లో ప్రథమ బహుమతి జడ్పీహెచ్ఎస్ పందిళ్లపల్లి, ద్వితియ బహుమతి గ్లోబల్ హైస్కూల్, బాలికల ఖోఖో పోటీల్లో అండర్ 17లో ప్రథమ బహుమతి జడ్పీహెచ్ఎస్ కొదుమూరు , ద్వితియ బహుమతి కేజీబీవి చింతకాని, అండర్14 విభాగంలో ప్రథమ బహుమతి జడ్పీహెచ్ఎస్ కొదుమూరు ద్వితియ బహుమతి కేజీబీవి చింతకాని, వాలీబాల్ పోటీల్లో అండర్ 17లో ప్రథమ బహుమతి కేజీబీవి చింతకాని , ద్వితియ బహుమతి జడ్పీహెచ్ఎస్ రామకృష్ణాపురం, అండర్ 14 విభాగంలో ప్రథమ బహుమతి కేజీబీవి చింతకాని, ద్వితియ బహుమతి జడ్పీహెచ్ఎస్ కొదుమూరు విద్యార్థులు గెలుపొందారు. ఈ క్రీడా పోటీలకు కన్వీనర్‌గా స్టిపెన్ బ్రదర్ వ్యవహరించగా మండల కార్యదర్శి సీహెచ్ క్రిష్ణయ్య, పిడీలు పూనాటి వెంకటేశ్వర్లు, ఈశ్వరి, యం సుధాకర్ పర్యవేక్షించారు.

# జాతీయ పోటీలకు స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థి ఎంపిక




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ రాష్ట్ర స్థాయి పోటీలలో స్మార్ట్ కిడ్జ్ పాఠశాలకు చెందిన ఒకటవ తరగతి విద్యార్థి పసుపులేటి వీక్ష రెండు విభాగాలలో పతకాలు సాధించిందని తెలిపారు. 400 మీటర్ల రోలర్ స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్, 600 మీటర్ల స్కేటింగ్ సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. డిసెంబర్‌లో జరగనున్న జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు వీక్ష ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో 600, 400 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. స్కేటింగ్ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు వీక్ష ఎంపికై జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిందన్నారు. తమ పాఠశాలలో చిన్నారులకు విద్యతో పాటు అన్ని రంగాలలో శిక్షణనిస్తున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చూపి పతకాలను సాధించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వీక్షను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైరా పోలీసుల చొరవతో ఇద్దరికి కృత్రిమ చేతులు ఏర్పాటు












**ప్రజాపక్షం/వైరా:** వైరా పోలీసుల సహకారంతో ఇద్దరు యువకులకు కృత్రిమ చేతులను ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారి సౌజన్యంతో వైరా పోలీసులు ఇద్దరి యువకుల పరిస్థితిని వారికి వివరించగా స్పందించిన వారు ఇద్దరికి కృత్రిమ చేతులను అమర్చారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన పమ్మి ముత్యం గత 20 ఏళ్ల క్రితం ప్రమాదంలో చేతులు కోల్పోయి జీవనం సాగిస్తున్నాడు. అదేవిధంగా కారేపల్లి మండలం జైతురాం తండాకు చెందిన కీలోతు నరేష్ గత ఏడాది ప్రమాదవశాత్తు చేయిని కోల్పోయాడు. వీరిద్దరి సమస్యలను వైరా పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ పుప్పాల రామారావు దృష్టికి తీసుకురావడంతో ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి రోటరీ క్లబ్ ప్రతినిధులను ఎస్సై రామారావు సంప్రదించి వారి ఇద్దరి చేతులు పోయిన విషయాన్ని వారికి వివరించగా స్పందించని వారు జర్మని నుండి దిగుమతి చేసుకున్న అధునాతన టెక్నాలజీతో కూడిన కృత్రిమ చేతులను వారికి అందించారు. ఈ సందర్భంగా ఆ యువకులు ఎస్సై రామారావుకు, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సిపిఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/వైరా:** సిఆర్‌పిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైరా ప్రభుత్వ వైద్యులు డాక్టర్ హర్ష తెలిపారు. వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కార్డియో పలమనేరి రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సును నిర్వహించిన డాక్టర్ హర్ష మాట్లాడుతూ తాత్కాలికంగా గుండె ఊపిరి పీల్చుకోవడం ఆగిపోయిన వారికి సిపిఆర్ విధానంలో చికిత్స చేసి బ్రతికించవచ్చునని ప్రయోగాత్మకంగా విద్యార్థులకు తెలియజేశారు. ఈ ప్రక్రియ ద్వారా గుండె కొట్టుకోవడం, శ్వాస తీసుకోవడం ఆగిపోవడం వలన సిపిఆర్ చికిత్స వెంటనే చేసి అతని ప్రాణాలు వెంటనే కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రాక్టికల్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవ్యజ్యోతి, వైద్య బృందం జాన్సన్, నర్సింహులు, అనంతరాములు, రవి, అధ్యాపకులు వీరస్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు మరింత చేరువ చేయండి

## కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : విద్యార్థులు, ప్రజలు, పల్లె లకు బిఎస్ఎన్ఎల్ సేవలు మరింత అందుబాటులోనికి తీసుకురావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం ఐడిఒసిలో ఇండియన్ టెలికమ్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి భాస్కర్ రావు బృంధం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ మరింతగా గ్రామాల్లోకి వెళ్లే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. మండలానికి పంచాయితీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని సేవలు మరింత అందుబాటులోనికి వచ్చేలా కృషి చేయాలని సూచించారు. నెట్ వర్క్ వేగవంతంగా పనిచేస్తే సెల్‌ఫోన్ల ద్వారా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు, కరెంట్ అఫైర్స్, తెలుసుకునే అవకాశం ఉంటుందని, తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభ్యమవుతాయని చెప్పారు. పంచాయితీలలో బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్‌ను అందజేసి ప్రతీ గ్రామంలో ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లే విధంగా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను సంస్థ ప్రతినిధులు షాలువాతో సత్కరించారు. ఈ కార్రక్రమంలో ఐటిఎస్ డైరెక్టర్ ఎం అరవింద్, ఐటిఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ గణేష్‌కుమార్, ఏటిఎం జి సుభాష్, ఎస్‌డిఇ సక్రు, ఎంఆర్‌డివి శివరాంజీ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ విజన్ – 2047 సర్వేలో ఉద్యోగులు పాల్గొనాలి : కలెక్టర్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రేజింగ్ విజన్ 2047 సర్వేలో జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తప్పని సరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాన్ను దశాబ్దాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం, విద్య, ఆరోగ్య, వ్యవసాయం, పరిశ్రమలు,ఐటి, పర్యావరణ పరిరక్షణ రంగాల్లోఅగ్రగామిగా నిలిపే దిశగా ప్రభుత్వం తెలంగాణ రేజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ విజన్ పత్రం భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తందని చెప్పారు.




# సౌకర్యాల ప్రణాళికలు సిద్ధం చేయండి : కలెక్టర్

ప్రజాపక్షం/భద్రాచలం : ఐటిడిఏ ప్రాంగణంలో నిరుపయోగంగా, ఉపయోగంలో ఉన్న వివిధ భవనాలను వివిధ రంగాల్లో మహిళకు శిక్షణ అందించేందుకు సౌకర్యవంతంగ తయారు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఐటిడిఏ ప్రాంగణంలోని ఎస్ఆర్‌సి నాయకపాడు మాస్కలు తయారీ కేంద్రం, పిఎంఆర్‌సి గదులు, గిరిజన భవనం, భద్రాచలం పట్టణలోని గిరి బజార్‌ను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్, సబ్ కలెక్టర్ మిన్రాని శ్రేష్టతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మందులు భద్రపరిచేందుకు ప్రత్యేక ర్యాకులు, గిరిజన కల్చర్ కు సంబంధించిన పెయింటింగ్ చిత్రాలు, ఫ్లెక్సీల రూపంలో వేయించి అందుబాటులోనికి తెవాలన్నారు. గిరిజన భవన్‌లో పూర్తి సదుపాయాలు సిద్ధం చేయాలని, గిరిజన బజార్‌లో వస్తువులను విక్రయాలు చేసే క్రమంలో ప్రజలతో మర్యాదగా మెలగాలని, అటవీ ఫల సముదాయాలు దళారుల పాలు కాకుండా జిసిసి కొనుగోలు చేయాలని అన్నారు. భవనాల మరమ్మత్తులపై ఈనెల 31 నాటికి నివేదికలు అందించాలన్నారు. ఈ కార్యక్రమలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, డిడి అశోక్, ఇఇ మధుకర్, ఐటిసి చీఫ్ మేనేజర్ చెంగల్ రావు, ఏసిఎంఓ రమేష్, డిఎంజిసిసి సమ్మయ్య, తహశిల్దార్ వెంకటేశ్వర్లు, జేడిఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన యువత ఆర్థికాభివృద్ధి చెందాలి



ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన .యువత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిరపడి ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబాలను పోషించుకోవాలని ఐటిడిఏ అదనపు ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జోలన్ డ్రైవింగ్ ట్రైనింగ్ కాలేజీ టిఎస్ఆర్‌టిసి వరంగల్ హేవీమోటర్ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణకు ఎంపికై ఈనెల 22 నుండి నెల రోజుల పాటు శిక్షణకు వెలుతున్న గిరిజన యువకులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మంచి మెలుకులతో డ్రైవింగ్ నేర్చుకోవాలని, మత్తుపదార్థాలకుదూరంగా వాహనాలు నడపాలని, సమయాన్ని వృధా చేయకుండా పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. డ్రైవింగ్ చేసే క్రమంలో ట్రాఫిక్ సిగ్నల్స్ పై పూర్తి అవగాహన తెచ్చుకోవాలని, తోటి యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేడిఎం హరికృష్ణ, వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజన యువకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలి

## -ఎస్‌పి రోహిత్ రాజ్



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, ఇందుకు పోలీసులతో కలిసి సహకరించాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఇందులో భాగంగా బుధవారం నుండి నెలరోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలన కోసం వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఎస్‌పి చైతన్యం పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల రోజుల పాటు చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. యువత మత్తుకు బానిసై విలువైన జీవితాన్ని పాడు చేసుకుంటుందని, వారిలో చైతన్యం నింపేందుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ప్రతీ కార్యక్రమాన్ని ప్రణాళికా బద్ధంగా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్‌పి చంద్రబాను, కొత్తగూడెం డిఎస్‌పి రెహమాన్, మణుగూరు డిఎస్‌పి రవీంధర్, పాల్వంచ డిఎస్‌పి సతీష్‌కుమార్, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ప్రజాపక్షం/పాల్వంచ: మున్సిపల్ పరిధి శ్రీనివాస కాలని మినీ స్టేడియం ఎదురుగా ఉన్న పాత ఇనుప కొట్టుసమీపంలో గల కాలువలో ఓ గుర్తు తెలియని మహిళ మృత దేహం బుదవారం కనిపించినది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కాగా ఆమెను షేక్ మహబూబీ ( 35 ) గా గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# కమ్మకట్ల నారాయణకు నివాళి



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలం రామాంజ వరం మాజీ ఉప సర్పంచ్ కమ్మకట్ల నారాయణ దశదినకర్మ బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, కార్యవర్గ సభ్యులు నోముల రవి, మాజీ ఎంపీటీసీ పాయం లక్ష్మి , డొంక రాములు, నిమ్మల భాస్కర్, మదార్ తదితరులు పాల్గొని పులమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సిపిఐ పార్టీలో ఉప సర్పంచ్ గా పని చేశారని, పార్టీ లో యాక్టివ్ గా పనిచేశారని వారి సేవలను గుర్తు చేసుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని మాస్‌లైన్ ప్రజా పంథ కేంద్ర కమిటీ సభ్యులు పోటు రంగా రావు అన్నారు. తిరుమలాయపాలెం మండల పరిధిలోని పిండిప్రోలు, పాపాయిగూడెం, కేశవాపురంలో బుధవారం జరిగిన ఎంపిటిసి ఎన్నికల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వెంటనే 42శాతం బిసిలకు రిజర్వేషన్ కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు, రాయల రవికుమార్, తిమ్మిడి హన్మంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఆరంపల వెంకన్న, ఎడ్లపల్లి నవీన్, మీగడ సత్యం, పరికిపల్లి మధు, గోకినపల్లి సరోజిని, దొడ్డ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ఏజెన్సీ ప్రజలకు అండగా పోలీస్ శాఖ



ప్రజాపక్షం/భద్రాచలం : జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పోలీస్ శాఖ అనునిత్యం అందుబాటులో ఉంటుందని అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ నరేందర్ అన్నారు. చర్ల మండలంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన ఎర్రంపాడు గ్రామాన్ని భద్రాచలం ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, సిఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ వివేక్ రంజన్, చర్ల సిఐ రాజువర్మతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నెస్టిల్ కంపెనీ సహకారంతో 250 కుటుంబాలకు నిత్యవసరాలు అందించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ మవోయిస్టు ప్రభావిత మారుమూల గ్రామాల ప్రజలకు పోలీసుల సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. విద్యా,వైద్య, రహదారులు, మంచినీటి వంటి కనీస సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు గుర్తుచేశారు. ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అభివృద్ధి నిరోదకులైన మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని కోరారు. సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అయన నిత్యవసర సరుకులు అందించేందుకు కృషి చేసిన నెస్టీలీ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళలు, యువతీ యువకులు ఉచిత విద్యా శిక్షణకై దరఖాస్తులు చేసుకోండి



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి యాజమాన్యం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు, యువతీ యువకులు ఉచిత విద్యా శిక్షణకై దరఖాస్తులు చేసుకోవాలని డిజిఎం పర్సనల్ ఎస్. రమేష్ కోరారు. మణుగూరు ఏరియా పివి కాలనీ నందు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు, యువతీ యువకులకు టైలరింగ్, కంప్యూటర్ డిటిపి, స్పోకెన్ ఇంగ్లీష్, క్లాత్ / జ్యూట్ / బంజరా బ్యాగ్స్ / ఫొటో షాప్, మల్టీ మీడియా కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చుటకై యాజమాన్యం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఆశక్తి గల సింగరేణి కుటుంబాలు, మాజీ సింగరేణి కుటుంబాలు, మహిళలు, యువతీ యువకులు, స్థానిక, పరిసర ప్రాంత మహిళలు, యువతులు తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులకు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జతచేసి ది. 30.10.2025లోపు, జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్మెంట్ విభాగంలో అందజేయటం దావరా ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు.

# విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి : ఆర్డీఓ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని విద్యార్థులు చిన్న తనం నుంచే క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు తెలిపారు. కొణిజర్లకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రజాక్ నూర్జహన్ దంపతుల కుమారుడు షఫీ ఇంజనీరింగ్ విద్యకు చేయూతనందించాలని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టును అభ్యర్థించారు. బుధవారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 20వేల చెక్కును, జ్ఞాపికను ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు చేతుల మీదుగా విద్యార్థికి అందించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం చేయూతనందిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు నిర్వహకులు పరిశ పుల్లయ్యను అభినందించారు. ప్రతి ఒక్కరూ సేవ గుణాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను అందించాలని ఆర్డీవో ఆకాంక్షించారు. ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంపిడిఓ జి. లక్ష్మయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు బి. కోట్యా, విద్యార్థి తండ్రి రజాక్ మియా తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** ఖమ్మం అర్బన్ మండలం నార్త్ లెవల్ క్రీడా పోటీలను ఎంఈవో శైలజ లక్ష్మి ప్రారంభించారు. బుధవారం ఖమ్మం నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఎంఈవో శైలజలక్ష్మి , కన్వీనర్ అశోక్‌రెడ్డి లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. కన్వీనర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్లూమింగ్ మైండ్స్ పాఠశాల ఆధ్వర్యంలో క్రీడా పోటీలకు ప్రతి ఏడాది అతిథ్యమిస్తున్నట్లు అశోక్‌రెడ్డి తెలిపారు. గురువారం అండర్ 14, 17 క్రీడలను నిర్వహించడం జరుగుతుందని క్రీడల కార్యదర్శి కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగప్రసాద్, నాగుల మీరా, రోజా, విజయకుమారి, సంపత్, బిక్కన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్ సర్వీసులు

**-ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** కార్తీక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం పుణ్యక్షేత్రాలకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో అన్ని బస్ డిపోల నుంచి బస్ సర్వీసులను నడపనున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ తెలిపారు. బుధవారం ఖమ్మం రీజినల్ మేనేజర్ కార్యాలయంలో రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లతో ఆర్ఎం ఎ. సరిరామ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పుణ్యక్షేత్రాల బస్ సర్వీసులకు సంబంధించి పోస్టర్‌ను ఆర్ఎం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పుణ్యక్షేత్రాలైన అన్నవరం, పంచా రామాలకు సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్ ప్రెస్ సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని బస్ స్టేషన్ల నుంచి కార్తీక మాసంలో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు బస్సులు బయలుదేరతాయని తెలిపారు. పంచారామాలకు సూపర్ లగ్జరీ బస్సు ఛార్జీ పెద్దలకు రూ. 2300, పిల్లలకు రూ. 1200, అన్నవరంకు డీలక్స్ బస్సులో పెద్దలకు రూ. 750, పిల్లలకు రూ. 420 బస్‌ఛార్జీ ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ సంపత్, అన్ని డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** కొత్తగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయడంతో పాటు ఉన్న రోడ్ల మరమ్మలు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో రోడ్ల నిర్వహణపై రోడ్లు, భవనాల శాఖ జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు రహదారులు చాలా చోట్ల దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న రోడ్ల గుంతలు, చిన్న చిన్న మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రవేశం వద్ద నలువైపులా జిల్లాకు సంబంధించి నామ బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రం ప్రవేశం వద్ద రోడ్లు దెబ్బతిని ఉన్నాయని, నగర పరిధిలోని రోడ్ల నిర్వహణ నగర పాలక సంస్థ చేపడుతుండగా ప్రారంభం వద్ద సంబంధిత శాఖలు రోడ్ల నిర్వహణ చేయాలని కలెక్టర్ అన్నారు రహదారి భద్రత అధికారులుగా మనపై ఉందని కలెక్టర్ అన్నారు. బైపాస్ బ్రిడ్జి వెడల్పుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అల్లిపురం, వెలుగుమట్ల తదితర ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాల తరలింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మంజూరైన రోడ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో ఆర్అండ్‌బి ఎస్ఈ యాకుబ్, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి, నేషనల్ హైవే పిడి రామాంజనేయరెడ్డి, ఆర్అండ్‌బి ఇఇలు పవార్, తానేశ్వర్, నేషనల్ హైవే ఇఇ యుగంధర్, డిఈలు ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ డిఈవోస్ రాష్ట్ర కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల ఆరోగ్యశ్రీ డిఈవోస్ సంఘం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని కోణార్క్ హోటల్‌లో కె. వినయ్ భాస్కర్ అధ్యక్షతన సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీలో పని చేస్తున్న డిఈవోల సమస్యలపై చర్చించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడంతో పాటు ఉద్యోగ భద్రతకు ప్రభుత్వానికి విన్నవించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఖమ్మంకు చెందిన కె. వినయ్ భాస్కర్, అసోసియేట్ అధ్యక్షులుగా కె. శ్రీహరి, కార్యదర్శిగా జి. సుధాకర్, కోశాధికారిగా పి. సంతోష్, ఉపాధ్యక్షులుగా ఎన్. ఎల్లేష్, లావణ్య, సహాయ కార్యదర్శులుగా బి. సతీష్, శోభ, ప్రచార కార్యదర్శిగా బి. గౌతం, పబ్లిసిటీ సెక్రటరీగా మౌనిక, ఈసి మెంబర్లుగా ఎస్‌కె ఇమ్మాన్, జి. సాగర్, సునీత లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టిఎన్‌జీవోస్ నాయకులు నందగిరి శ్రీనివాసరావు వ్యవహరించారు. నూతన కమిటీ ఎన్నికల పత్రాన్ని నందగిరి శ్రీను అందజేశారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆరోగ్యశ్రీ డిఈవోలు పాల్గొన్నారు.

# అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/పెనుబల్లి:** విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, సివిల్ సప్లై అధికారులు దాడి చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పెనుబల్లి మండల కేంద్రానికి చెందిన మహిళ ఇంటిలో అక్రమంగా నిల్వ చేశారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించి 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాని మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని బుధవారం రేషన్ షాపుకు తరలించి సివిల్ సప్లై అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీఎస్పీ యాదయ్య, సివిల్ సప్లై ఆర్ఐలు నరేష్, కిరణ్, వంగా ముత్యాల బంజర్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రామసహాయం నరేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని సుబ్లేడు గ్రామంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను సంఘబత్తుల సుమన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు నుంచి వచ్చిన తమ అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్ల పంపిణీ అనంతరం సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించి సుమారు 45మంది తమ రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వరర్యంలో రామసహాయం నరేష్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తామని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, పొట్ల కిరణ్, బోడ మంగీలాల్, ఓరా వెంకటేశ్వర్లు, సుమన్‌ఉెడ్డి, ఇబ్రాయిల్, ఉన్నం రాజశేఖర్,, కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, గుండాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన అడిషనల్ డైరెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని టాస్క్‌ఫోర్స్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు, వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ శశిశ్రీ పరిశీలించారు. బుధవారం అడిషనల్ డైరెక్టర్ శశిశ్రీ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. నరేందర్ అడిషనల్ డైరెక్టర్ శశిశ్రీని ప్రతి వార్డుకు తీసుకెళ్లి అక్కడ రోగులకు అందిస్తున్న సేవలను, వైద్యులు, సిబ్బంది పనితీరును వివరించారు. వార్డులను, ఆసుపత్రి థియేటర్‌ను, డ్రగ్ స్టోర్స్‌ను సందర్శించారు. వార్డుల్లో ఉన్న రిజిస్టర్లను, రికార్డులను, రోగుల కేస్ షీట్లను పరిశీలించారు. ఆసుపత్రిలో ఫైర్ సేఫ్టీకి సంబంధించిన పరికరాలను పరిశీలించారు. ఐదు లక్షలకు పైబడిన ఆసుపత్రి పరికరాలను వార్షిక మెయింటినెన్స్ చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆసుపత్రిలో కావాల్సిన సౌకర్యాలు, మందుల సరఫరా గురించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఈవో వి. రవికుమార్, ఎన్‌హెచ్ఎండిపివో దుర్గ, బయో మెడికల్ ఇంజనీర్ ఇస్లావత్‌రెడ్డి, ఫార్మసీ సూపర్‌వైజర్ వై. పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మం నగరంలోని పాండురంగాపురం బస్తీదవాఖానాను సందర్శించారు.

# రాజ్‌భవన్ ముట్టడిని జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ మధిర :** బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని అసెంబ్లీలో చేసిన బిల్లును గవర్నర్ సంతకం చేయకుండా నిలువరించడాన్ని నిరసిస్తూ సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 17న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాజ్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందని పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. బుధవారం స్థానిక బోడేపూడి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిసిల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ బిజెపి వైఖరికి నిరసనగా బిసిలు బిసి సంఘాలు సిపిఎం పార్టీ ఇచ్చిన పిలుపులో భాగస్వామ్యులై రాజ్‌భవన్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి తెలంగాణ రాష్ట్రంలో 42శాతం బిసి రిజర్వేషన్‌కు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న బిసి సంఘాల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని, ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ నాయకులు శీలం నర్సింహారావు, దివ్వెల వీరయ్య, మందా సైదులు, పడకంటి మురళీ, పెంటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.